క్లుప్తంగా

నేడు చీమకుర్తిలో విద్యుత్ అదాలత్

చీమకుర్తి: చీమకుర్తి మండల పరిధిలో సోమవారం విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి పవర్ ఆఫీస్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. లో ఓల్టేజీ, విద్యుత్ బిల్లులు వంటి సమస్యలను విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దర్శి డివిజన్ డీఈఈ ఎస్పీ కరీంతో పాటు ఒంగోలు అధికారులు, ఏడీ హాజరవుతారని తెలిపారు.

బీఎస్ రావు సేవలు మరువలేము


బీఎస్ రావుకు నివాళులర్పిస్తున్న చైతన్య విద్యాసంస్థల సిబ్బంది

ఒంగోలు అర్బన్: విద్యారంగానికి శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బీఎస్ రావు అందించిన సేవలు మరువలేనివని జోన్ ఆర్ఐ అనిల్, డాక్టర్ ఆలూరి ప్రభాకర్, కాలేజీ డీన్ ఆర్కే అన్నారు. ఇటీవల మృతిచెందిన బీఎస్ రావుకు ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డులోని చైతన్య కాలేజీ ఆవరణలో నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదిగి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుని ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక భాగ్యనగర్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, ఇతర బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని బీఎస్ రావుకు నివాళులర్పించారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: విద్యుత్ వైరు కిందకు జారి ఉండటంతో రోడ్డుమీద బైక్ మీద వెళ్తున్న యువకుడికి వైర్లు తగిలి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన గుర్రం వెంకటరావు అదే గ్రామానికి చెందిన మొద్దు నరసమ్మలు బైకుమీద అద్దంకికి వస్తున్నారు. ఈ క్రమంలో గండ్లకమ్మ బ్రిడ్జి దాటి అద్దంకిలోకి వస్తుండగా రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వైర్లు ముందుగా వెళ్తున్న పొక్లెయిన్‌కు తగిలి కిందకు జారాయి. వెనుకనే వస్తున్న వెంకటరావుకు తగలటంతో కిందపడ్డాడు. ఈఘటనలో వెంకటరావు గొంతు కోసుకుంది. వెనుక కూర్చున్న నరసమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సమయంలో కరెంట్ లేకపోవటంతో ప్రమాదం తప్పిందని బంధువులు తెలిపారు.


పాముల సయ్యాట


సయ్యాటలాడుతున్న పాములు

అద్దంకి: మండలంలోని అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్‌లోని ఎస్ఈబీ పోలీస్ స్టేషన్ సమీపంలో రెండు పాములు పెనవేసుకుని సయ్యాటలాడాయి. ఈదృశ్యాన్ని స్థానికులు చూస్తున్నా అవి తమకేం పట్టదన్నట్లు ఆటను కొనసాగించాయి. అరుదుగా కనిపించే ఈ దృశ్యాన్ని కొందరు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

- ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు అధికారుల శ్రద్ధ
- 50 డివిజన్లను 5 భాగాలుగా విభజన
- ప్రతి 10 డివిజన్లకు ముగ్గురు ప్రత్యేక అధికారులు
- ప్రతిరోజూ తెల్లవారుజామున 5.30 గంటల నుంచే పర్యవేక్షించే విధంగా కార్యాచరణ
- ఆప్‌కాస్, పబ్లిక్ హెల్త్ పర్మినెంట్ ఉద్యోగులకూ వర్తించేలా చర్యలు


ఒంగోలు నగరం వ్యూ...

ఒంగోలు సబర్బన్: నగరంలో పారిశుధ్యంపై కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు నగర ప్రజలకు మురుగు సమస్య లేకుండా చేయడంతో పాటు నగరంలోని ఏ ఒక్కరూ అసౌకర్యానికి గురికాకూడదన్న ఉద్దేశంతో ప్రత్యేక చర్యలు చేపట్టారు. బాలినేని సూచనల మేరకు అన్ని విషయాలను పరిగణలోకి తీసుకున్న ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు నగరంలో ఉన్న 50 డివిజన్లను ఐదు భాగాలుగా విడగొట్టారు. ఒక్కో విభాగానికి ముగ్గురు చొప్పున ప్రత్యేక అధికారులను నియమించారు. ఆ మేరకు శనివారం ఆర్‌సీ నంబర్–28654/2016/ఎఫ్ 2 ఉత్తర్వులు జారీ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రణాళికలు...

ఒంగోలు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒంగోలు నగరాన్ని ఐదు శానిటరీ డివిజన్లుగా విడగొట్టి పారిశుధ్యం మెరుగుకు ప్రణాళికలు రూపొందించారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక్కో శానిటరీ డివిజన్‌కు ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఒంగోలు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల హాజరును ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించే విధంగా దిశానిర్దేశం చేశారు. నగరపాలక సంస్థలో ఆప్‌కాస్‌కు సంబంధించి విధులు నిర్వర్తిస్తున్న 681 మందితో పాటు పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన పర్మినెంట్ శానిటరీ సిబ్బంది 101 మంది కూడా ఈ ప్రత్యేక అధికారులు పర్యవేక్షించే విధంగా కార్యాచరణ చేపట్టారు. ఇప్పటి వరకు పర్యవేక్షణలో ఉన్న శానిటరీ అధికారులు యథావిధిగా వారి విధులు నిర్వర్తించాల్సిందే. అయితే మరింత మెరుగైన పారిశుధ్యాన్ని ఒంగోలు నగర ప్రజలకు అందించడమే లక్ష్యంగా సరికొత్తగా అడుగులు వేస్తున్నారు. అందుకు గానూ ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రతి 10 డివిజన్లకు ముగ్గురు అధికారుల చొప్పున నియమిస్తూ కమిషనర్ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యాచరణ ఇలా...

- శానిటరీ డివిజన్లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు వారికి కేటాయించిన శానిటరీ డివిజన్లలో పారిశుధ్య పనులను పర్యవేక్షించాలి. ఆయా ప్రాంతాల్లో కేటాయించిన శానిటరీ సిబ్బంది ఉన్నారా.. లేరా..? లేకుంటే వారు సెలవులో ఉన్నారా.. వాళ్ల ఆరోగ్య పరిస్థితి ఏమిటనే విషయాలను ఆ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.
- ఆప్కాస్ శానిటరీ వర్కర్లుగానీ పబ్లిక్ హెల్త్ పర్మినెంట్ వర్కర్లకుగానీ జీతభత్యాలు చెల్లించాలంటే వారి హాజరు ప్రధానం. అందువలన అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించే విధంగా ఉత్తర్వులు జారీ చేశారు. వారి హాజరు పట్టిక ఆధారంగానే జీతభత్యాలు చెల్లిస్తారు.
- హాజరు పట్టికను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వద్ద నుంచి తీసుకుని రోజువారీ పారిశుధ్య కార్మికుల హాజరు నమోదు వివరాలను మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వారికి ఇవ్వాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రత్యేకంగా నియమించిన అధికారుల్లో ఇద్దరు రోజు మార్చి రోజు విధిగా హాజరును పర్యవేక్షించి నివేదికలు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు తప్పనిసరిగా అందించాలి.
- దొంగ హాజరు, ఒకరికి బదులుగా మరొకరు పనిచేయడం లాంటి ఫిర్యాదులు ప్రతిరోజూ అధికారులకు వస్తూనే ఉన్నాయి. అలాంటి వాటికి తావులేకుండా చేయడంలో భాగమే ఈ ప్రత్యేక అధికారుల నియామకం. హాజరు విషయంలో అధికారులు కచ్చితత్వాన్ని పాటించాలి. అందుకు భిన్నంగా ఎవరు వ్యవహరించినా చర్యలు మాత్రం తప్పవని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- ప్రత్యేకంగా నియమించిన అధికారుల పర్యవేక్షణలో లోపం ఉంటే వారికి కూడా ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐదు డివిజన్ల హాజరు వివరాలను కన్సాలిడేట్ చేసి ప్రతి రోజూ ఎగ్జిక్యూటివ్ అథారిటీకి అందించాలి.

ఐదు డివిజన్ల ప్రత్యేక అధికారులు...

డివిజన్-1 : మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సి.మనోహర్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ టి.చంద్రశేఖర్, డబ్ల్యూఎస్ఈఎస్ ఇస్లాంపేట్ పి.చంద్రశేఖర్.

డివిజన్-2 : హార్టికల్చర్ ఏడీ ఐ.వెంకట్రావ్, ఆర్ఐ-1 టి.మధుసూదన్‌రావు, డబ్ల్యూఎస్ఈఎస్ గానుగపాలెం మద్దులూరి సురేష్

డివిజన్-3 : డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గణపతి, ఆర్ఐ-2 ఎల్.విజయభాస్కర్, డబ్ల్యూఎస్ఈఎస్ రాజాపానగల్ రోడ్డు సీహెచ్ కృష్ణకుమార్

డివిజన్-4 : డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.పద్మజ, టీపీవో పి.వేణు, డబ్ల్యూఎస్ఈఎస్ హౌసింగ్‌బోర్డు కాలనీ జి.వెంకట సుబ్బయ్య

డివిజన్-5 : డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘురామ్, అసిస్టెంట్ ఇంజినీర్ అంజిరెడ్డి, డబ్ల్యూఎస్ఈఎస్ శారదా బాలకుటీర్ డి.శ్రీనివాసరావు

సుజాతనగర్ సమస్యకు చెక్

- చుక్కల భూములకు ఇటీవల విముక్తి కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- సుజాతనగర్ 8వ లైన్ నుంచి 12వ లైన్ వరకు రిజిస్ట్రేషన్లకు అనుమతి
- త్వరలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాల పంపిణీ
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

ఒంగోలు: సొంతిల్లు ఉండటం ఒక ఎత్తయితే.. ఉన్న రూకలు మొత్తం దాని కోసం వెచ్చించి సంతోషంగా ఉన్నామనుకుంటున్న దశలో ఆ ఇల్లు కాస్తా వివాదంలో చిక్కుకుంటే ఆ కుటుంబం పడే వేదన వర్ణించలేము. ఒంగోలు నగరంలోని సుజాతనగర్‌లో దాదాపు ఐదు లైన్లలోని ఇళ్ల వారికి అదే పరిస్థితి. అది కూడా నగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతంగా పిలుచుకునే సుజాతనగర్ కావడంతో ఆయా స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్న వారికి ఎన్నో ఏళ్లుగా మనశ్శాంతి కరువైంది. అలాంటి సమస్యకు చెక్ పెడుతూ వారి స్థలాలపై సంపూర్ణ హక్కు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకోవడంతో ఆ ప్రాంత వాసుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

నాడు ఆనందం ఆవిరి ఇలా...

వాస్తవానికి బ్రిటీష్ ప్రభుత్వ హయాంలో భూ సర్వే జరిగింది. ఆ సమయంలో భూములకు పెద్దగా విలువ లేకపోవడం, కొన్ని భూములను ఎవరూ తమవని నిర్ధారించుకునేందుకు ముందుకు రాకపోవడంతో రికార్డుల్లో ఆ భూముల హక్కుదారుల పేర్ల వద్ద చుక్కలు పెట్టి వదిలేశారు. అప్పటి నుంచి వాటిని చుక్కల భూములుగా పేర్కొంటూ వస్తున్నారు. ఆ తర్వాత ఆ భూముల యజమానులు వాటిని స్వాధీనం చేసుకోవడంతో చేతులు మారుతూ వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో బ్రిటీష్ కాలం నాటి చట్టం తీసుకొచ్చి స్థానిక సర్వే నంబర్ 229లోని 3.48 ఎకరాలను (సుజాతనగర్ 8వ లైన్ మొదలు 11వ లైన్ వరకు ఉన్న భూములను) చుక్కల భూములుగా ఆన్‌లైన్‌లో పేర్కొన్నారు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో నివాసం ఉండేవారిలో తీవ్ర ఆందోళన మొదలైంది. అత్యవసరానికి ఇంటిని తాకట్టు కూడా పెట్టుకోలేని పరిస్థితి. లక్షలాది రూపాయల నివాస కట్టడం ఉన్నా ఒక్క రూపాయి కూడా రుణం పొందలేని దుస్థితి.

పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే బాలినేని...

సుజాతనగర్‌లో చుక్కల భూముల సమస్య ఎదుర్కొంటున్న వారంతా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన చొరవ చూపి పలుమార్లు జిల్లా అధికారులతో మాట్లాడారు. ఆ భూములకు సంబంధించిన సమస్యను వివరించారు. ఈ నేపథ్యంలో చుక్కల భూముల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపింది. జిల్లాలోని దాదాపు 37 వేల ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించింది. ఇప్పటివరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములు కాస్తా నేడు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు, మార్టిగేజ్ చేసుకునేందుకు, ఇంకా వారి అవసరాలకు ఇష్టానుసారం వినియోగించుకునేందుకు సంపూర్ణ హక్కు కల్పించారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న గృహాలే దాదాపు 70 వరకు ఉండగా అనధికారికంగా దాదాపు 120 మంది వరకు ఉంటారని అంచనా.

> **సంపూర్ణ హక్కు కల్పిస్తూ త్వరలో వ్యక్తిగత పత్రం జారీ**
>
> చుక్కల భూములకు సంబంధించి సర్వే నంబర్ 229లోని వారికి విముక్తి లభించింది. ఇప్పటివరకు నిషేధిత జాబితాలో ఉండటంతో వారు సంపూర్ణ హక్కుకు దూరమయ్యారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ భూములను చుక్కల భూముల జాబితా నుంచి తప్పించారు. దీంతో ఇక ఆ ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు కూడా చేసుకోవచ్చు. కేవలం ఒంగోలులోని సుజాతనగర్‌లో 3.48 ఎకరాలకు మాత్రమే కాకుండా కొప్పోలు పరిధిలోని 30.11 ఎకరాల వ్యవసాయ భూమి, కరవదిలోని 42.97 ఎకరాల వ్యవసాయ భూములను చుక్కల భూముల జాబితా నుంచి తొలగించడం జరిగింది. వీరందరికీ సీఎం సంతకంతో కూడిన పత్రాలు వారిపేర్లపై వచ్చాయి. త్వరలోనే వాటిని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందజేస్తాం.
>
> – మురళి, తహసీల్దార్, ఒంగోలు

క్షేత్రస్థాయి సందర్శనతో విద్యార్థులకు మేలు


మొక్కల వైద్య లక్షణాలను వివరిస్తున్న అంజిరెడ్డి

ఒంగోలు టౌన్: పుస్తక పఠనంతో పాటు తరచూ క్షేత్ర స్థాయి సందర్శన చేయడం విద్యార్థులకు ఎంతో అవసరమని జాహ్నవి నీట్ అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ అన్నారు. నగరంలోని లాయర్‌పేటలో గల జాహ్నవి నీట్ అకాడమీ ఆధ్వర్యంలో బైపీసీ విద్యార్థులను ఆదివారం బొటానికల్ టూర్‌కు తీసుకెళ్లారు. తాళ్లూరు మండలం తూర్పుగంగవరం గ్రామంలోని గుంటిగంగ వద్ద వైవిధ్య ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆర్గానిక్ ఫార్మేషన్‌లో 60 రకాల మొక్కల గురించి వారికి వివరించారు. ట్రస్ట్ చైర్మన్ బి.అంజిరెడ్డి మొక్కల నుంచి కాయ రూపం దాల్చే ప్రక్రియలోని వివిధ దశలను విశదీకరించి చెప్పారు. వివిధ రకాల మొక్కల ఔషధ లక్షణాలను, వాటి ప్రయోజనాలను తెలిపారు. అందుబాటులో ఉండే మొక్కల గురించి ప్రత్యామ్నాయ వైద్య చిట్కాలను తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చిత్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులను ప్రోత్సహిస్తున్న బీజేపీ


సాగర్ సెంటర్లో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నగర కమిటీ నాయకులు

ఒంగోలు టౌన్: మణిపూర్‌లో శాంతియుతంగా కలిసిమెలసి బతుకుతున్న ప్రజల మధ్య చిచ్చుపెట్టి గిరిజనులపై దాడులను ప్రోత్సాహిస్తున్న బీజేపీ వైఖరి దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విమర్శించారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలపై దాడులను నిరోధించాలని కోరుతూ ఆదివారం స్థానిక సాగర్ సెంటర్లో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ దాడులను ఆరికట్టాల్సిన ప్రభుత్వమే మరింత రెచ్చగొట్టేలా వ్యవహరించడం క్షమార్హం కాదన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడటంలో ఘోరంగా విఫలమైన మణిపూర్ ముఖ్యమంత్రిని వెంటనే తొలగించాలని, ప్రజల మధ్య సామరస్యం నెలకొల్పేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మణిపూర్ ఘటనలపై పార్లమెంటులో చర్చించాలని చెప్పారు. ఈ ధర్నాకు నగర కమిటీ అధ్యక్షుడు జి.రమేష్ అధ్యక్షత వహించగా చీకటి శ్రీనివాసరావు, జి.ఆదిలక్ష్మి, ఎస్‌కే షేర్ సాహెబ్, మాలకొండయ్య, తంబి శ్రీనివాసరావు, దారా వెంకటేశ్వర్లు, శ్రీరాం శ్రీనివాసరావు, హరికృష్ణ, అత్తింటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

చీమకుర్తి: మణిపూర్ రాష్ట్రంలో ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహికంగా అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని సంతనూతలపాడు బస్టాండ్‌లో బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తరఫున కొవ్వొత్తులతో ఆదివారం రాత్రి నిరసన తెలిపారు. ఇలాంటి దారుణమైన సంఘటనలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని బీఎస్ఐకు చెందిన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎడ్లూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, రవివర్మ, స్థానికులు పాల్గొన్నారు.

దశపర్ని ద్రావణంతో చీడపీడల నివారణ


దశపర్ని ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్

ముండ్లమూరు: గ్రామాల్లో ఉచితంగా దొరికే వివిధ రకాల ఆకులతో దశపర్ని ద్రావణం తయారు చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ అన్నారు. పోలవరంలో ఆదివారం దశపర్ని ద్రావణం తయారీపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దొరికే వేపాకు, ఉమ్మెత్త, జిల్లేడు, కానుగ, దోస, నేరేడు, బొప్పాయి, జామ , కాకార తదితర ఆకులను దంచి ఆవుమూత్రం, ఆవుపేడ, 10 కేజీల చొప్పున సేకరించాలన్నారు. వీటిని తగిన మోతాదులో నీటిలో కలియబెట్టి 41 రోజులు మరిగాక దశపర్ని ద్రావణం సిద్ధమవుతుందని చెప్పారు. తద్వారా తక్కువ ఖర్చుతో చీడపీడలను నివారించాలని తెలిపారు. యూనిట్ ఇన్‌చార్జ్ ఎం. అనిత, ఐసీఆర్పీలు రాజశేఖరరెడ్డి, అంజలి, అరుణ నాగసుభాషిణి, రైతులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ సేవలు అభినందనీయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె


చైతన్య రథం వద్ద జంకె వెంకటరెడ్డి తదితరులు

మార్కాపురం: మానవతా స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో డి.శంకర్‌రెడ్డి జ్ఞాపకార్థం, షిరిడీసాయి ఎలక్ట్రికల్ సహకారంతో సుమారు రూ.7.50 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన శాంతి రథంను జంకె వెంకటరెడ్డి ద్వారా సంస్థ సభ్యులకు అందించారు. జంకె మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు మరితం విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, రామచంద్రారెడ్డి, పీవీ కృష్ణారావు, ఆర్‌కెజె నరసింహం తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, అధిక శ్రావణ మాసం ఉత్తర నక్షత్రం పంచమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శనివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందెతీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటలవరకుజరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అపార్ట్‌మెంట్ నుంచి కిందపడి..


పరమేశ్వరరెడ్డి

అద్దంకి రూరల్: ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ నుంచి కాలుజారి కిందపడి ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఆదివారం అద్దంకిలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని శంఖవరప్పాడు గ్రామానికి చెందిన ఏ.పరమేశ్వరరెడ్డి సాఫ్ట్‌వేర్‌గా ఇంటివద్ద నుంచే పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అద్దంకిలో నివాసం ఉంటున్న బ్రహ్మనందం కాలనీలోని అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో కాళ్లు, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ట!

- ఒకే ప్రదేశంలో విద్యుత్ తీగ తగిలి జూనియర్ లైన్‌మన్, 4 గేదెలు, 2 కుక్కలు మృతి
- కంభాలపాడు–ఓబులక్కపల్లి పొలాల్లో వరుస ప్రమాదాలు
- నిమ్మకునీరెత్తినట్టుగా విద్యుత్ శాఖ అధికారులు

పొదిలి రూరల్: ఒకే చోట వరుస విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నా సమస్యను పరిష్కరించకుండా విద్యుత్ శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఒకరు, కొన్ని పశువులు మృతి చెందినా ఆ శాఖ అధికారుల్లో చలనం లేకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలొస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల పొదిలి మండలంలోని కంభాలపాడు–ఓబులక్కపల్లి పొలాల్లో విద్యుత్ తీగల మరమ్మతులు చేసేందుకు వెళ్లి జూనియర్ లైన్‌మన్ దుర్మరణం చెందారు. అదే ప్రాంతంలో విద్యుత్ లైన్ తెగిపడటంతో ఓబులక్కపల్లె రైతుకు చెందిన మూడు గేదెలు మృతి చెందాయి. విద్యుత్ తీగ తెగి 20 రోజులైనా ఆ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అదే ప్రదేశంలో శనివారం నందిపాలెం గ్రామానికి చెందిన దోర్నాల రమణమ్మకు చెందిన మరో గేదె, రెండు కుక్కలు చనిపోయాయి. దీంతో కంభాలపాడు, ఓబులక్కపల్లి, నందిపాలెం రైతులు, పశువుల కాపరులు ఆ ప్రదేశానికి వెళ్లాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తెగిపడిన విద్యుత్ తీగను వెంటనే తొలగించి, మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా రుద్రాభిషేకం


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

త్రిపురాంతకం: శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల వద్ద శ్రీసత్యసాయి సేవ సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని ఆదివారం నిర్వహించారు. త్రిపురాంతకం ఆలయాల వద్ద సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా సత్యసాయి భక్తులు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, గోమాత పూజ నిర్వహించారు. కదంబ వనం మొక్కలు నాటే కార్యక్రమం, త్రిపురాంతకంలో నగర సంకీర్తన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి సాయి భక్తులు పాల్గొన్నారు. అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్లు కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామ పూజలు, కుంకుమ పూజలు, అఖండహారతి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.


త్రిపురాంతకంలో సత్యసాయి సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుద్రాభిషేకం

వైభవంగా పోలేరమ్మ కొలుపులు


కొలుపుల్లో అమ్మవారి చిత్రపటం

కారంచేడు: ప్రతి ఏటా సాగుకు ముందు గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి కొలుపులు నిర్వహించడం ఈ గ్రామ ఆనవాయితీ. దీనిలో భాగంగా ఈ ఏడాది వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందుగా గ్రామంలోని బందెలదొడ్డి బజారుకు చెందిన కొలుపులను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. చిన్నారుల కోలాటంతో గ్రామంలో పెద్ద ఎత్తున సంబరం నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి తలంటు స్నానాలు ఆచరించి, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామ దేవతను ప్రత్యేకంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగించారు. యువతీ, యువకులు వీరతాళ్లతో అమ్మవారి ప్రతిమకు ముందు నృత్యాలు చేశారు.